ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు


5

బుధవారం 24 జూలై 2024





వెలుగులు.. ఆదాయం



పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీమ్ కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చనుంది. దాదాపు గా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ని ఈ పథకం ద్వారా పొందవచ్చు. ఇందుకోసం ఏర్పాటు చేసే సోలార్ ప్యానెల్స్ యూనిట్‌కి అయ్యే ఖర్చులో రూ.60 వేల వరకు సబ్సిడీ, మిగతా రూ.లక్ష రుణం రూపంలో సమకూరుస్తారు. వినియోగదారుడు వినియోగించగా మిగిలే విద్యుత్‌ని విద్యుత్ సంస్థలు కొనుగోలు చేస్తాయి.

ఆక్వాకి.. అండ

బాపట్ల జిల్లాలోని ప్రధాన రంగాల్లో ఆక్వా ప్రముఖం గా ఉంది. దాదాపు 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. ఈ పరిస్థితుల్లో ఈ రంగానికి అండగా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటనలు వెలువడ్డాయి. ముఖ్యంగా రొయ్యలు, చేపల మేతపై



పన్నును 5 శాతానికి తగ్గించారు. దీని వల్ల మేత రేటు తగ్గి పెట్టుబడి ఖర్చుల్లో భారీ తేడా వస్తుంది. తద్వారా ఆక్వారంగం పునర్ వైభవం సాధించడానికి ఇది ఉపయోగపడుతుందనేది రైతుల మాట. రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్‌లు ఏర్పా టుకి ప్రత్యేక ఆర్థిక సాయం అందించడంతో పాటు నాబార్డ్ ద్వారా దీనిని ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. మొత్తం మీద కేంద్రం ఆక్వా రంగ అభివృద్ధికి ప్రత్యేక విధానాన్ని తీసుకురావడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమరావతికి.. అందలం

మోదీ 3.0 బడ్జెట్ అమరావతి బాట పట్టింది. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో ఊసే లేకుండా పోయిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి బాధ్యత మాదంటూ కేంద్రం బడ్జెట్‌లో భరోసా ఇచ్చింది. నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌లో అమరావతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడంపై అటు రాష్ట్రప్రజలతో పాటు అమరావతి వాసులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. అటు తరతరాల నుంచి ఉన్న భూములను అమరావతి కోసం ఇచ్చి జగన్ నిర్లక్ష్యం తో రోడ్డెక్కిన రాజధాని రైతులకు భరోసా ఇస్తూ కూటమి ప్రభు త్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఉమ్మడి గుంటూరు జిల్లావాసుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ అమరావతికి ప్రాధాన్యం ఇవ్వడంపై అన్ని వర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమ వుతున్నాయి. ప్రత్యేకంగా నిధులతో పాటు రాజధాని కార్యకలా పాలకు అండగా ఉంటామన్న కేంద్రం ప్రకటనతో ఇక అమరావతి అభివృద్ధికి ఢోకా ఉండదని తెలుస్తోంది. కాగా అమరావతికి ప్రత్యేక కేటాయింపులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు సంస్థలు అమరావతికి క్యూ కట్టనున్నాయి. దీంతో అమరావతి దశ తిరిగిపోయినట్లే.

- కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం
- పరుగులు పెట్టనున్న నవ నగర నిర్మాణాలు
- నిధుల కేటాయింపుతో రాజధాని దశ తిరిగినట్లే
- రూ.15 వేల కోట్ల కేటాయింపుపై రైతుల్లో హర్షం
- కష్టాలు తీరిపోయాయన్న ఆనందంలో రైతులు


గుంటూరు, బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ అమరావతి అంటే ఆగిపోయిన భవనాలు, అడవిలా మారిన గ్రామాలు, ఆవేదనా భరితమైన రైతులు. కానీ నేడు అది పూర్తిగా మారిపోయింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి తలరాత మారిపోయింది. నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఇక దేదీప్యమానంగా వెలగబోతోందని మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ద్వారా తెలుస్తోంది. గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్లో స్థానం కల్పించింది. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు సహాయాన్ని ప్రకటించింది. అమరావతి నిర్మాణ అవసరాల రీత్యా భవిష్యత్తులో మరింత సహాయం అందిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంగా పార్లమెంటులో ప్రకటించారు. అమరావతి అభివృద్ధికి సంబంధించి నిధులు సేకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ఫైనాన్సు సంస్థల ద్వారా రుణాలు సేకరించుకునేందుకు అవకాశం కూడా కల్పించింది. దీంతో అమరావతి నిర్మాణానికి ఇక ఎలాంటి ఢోకా లేదని తేలిపోయింది.

కుట్రలకు ముగింపు

2014 నుంచి 2019 వరకూ రాజధాని అమరావతి నిర్మాణం పరుగులు పెట్టింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ అమరావతిని విధ్వంసం చేసేందుకు ప్రయత్నించింది. మూడు రాజధానులను తెరమీదకు తెచ్చి అమరావతిని విచ్ఛిన్నం చేయడంతో పాటు, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో అమరావతికి స్థానం కల్పించడం, బడ్జెట్ నిధులు కేటాయించడంతో ఆ కుట్రలకు తెరపడినట్లయింది. ఆంధ్రుల రాజధాని అమరావతేనని కేంద్రం విస్పష్టంగా చెప్పినట్లయింది. దీంతో అమరావతిని భవిష్యత్తులో ఎవరూ కదిలించలేరని సందేశమిచ్చింది. కాగా కేంద్రం కేటాయించిన నిధులతో అమరావతిలోని ప్రభుత్వ భవనాల నిర్మాణాలన్నీ నిధుల కొరత లేకుండా పూర్తైపోనున్నాయి.

మౌలికంగా ఊరట

కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజల్లో భరోసా నింపింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ మౌలిక వసతులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. వీటన్నింటికి మరమ్మతులు చేసేలా కేంద్రం బడ్జెట్‌లో వాటికి ప్రాధాన్యం ఇచ్చింది. గడచిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దారుణంగా ఛిద్రమైన రహదారులు బాగుపడనున్నాయి. కేంద్రం నుంచి వచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల మొత్తం పెరగనుండటంతో రోడ్లకు మహర్దశ కలగనుంది. యువతకు విద్యారుణాలతో పాటు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇది కూడా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని యువతకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చేదే కావడం గమనార్హం. గ్రామీణాభివృద్ధికి పెద్ద మొత్తంలో కేటాయింపులు జరపడం, ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారంటీలాంటి వన్నీ ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి దోహదం చేసేవిగా ఉన్నాయి. విద్య, నైపుణ్యాభివృద్ధికి కేటాయింపులతో పాటు ఉపాధి కల్పన విషయంలోనూ ప్రత్యేక ప్రణాళికలను కేంద్రం ప్రకటించడం జిల్లాలోని యువతరానికి ఆశలు రేకెత్తించేవిగానే ఉన్నాయి. రూ.3 లక్షల వార్షికాదాయం లోపు ఉన్న వారికి ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా పన్ను రేట్ల శ్లాబులను సవరించడంపై ఉద్యోగ, వ్యాపారవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచినందున గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున పనులు లభించనున్నాయి. ప్రకృతి వ్యవసాయం కింద భారీగా రైతులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగాస్వామ్యంతో పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లను నిర్మించి ఇక్కడికి వచ్చే వలస కూలీలకు ఆవాసం కల్పించేందుకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తమౌతున్నది.



సొంతింటి కల సాకారం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల సొంత ఇంటి కలని సాకారం చేస్తామని కేంద్రం ప్రకటించింది. సొంతింటి నిర్మాణానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2.67 లక్షల వరకు సబ్సిడీగా అందించనుంది. పీఎంఏవై కింద ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీ-1, ఎంఐజీ-2 కేటిగిరీల కింద ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ఆర్థికసాయం అందించనున్నది. అలానే ఎఫోర్డబుల్ హౌసింగ్ ఇన్ పార్టనర్‌షిప్(ఏహెచ్‌పీ), బీఎల్‌సీ కింద నిర్మించే ఇళ్లకు కూడా ఆర్థికసాయం అందుతుంది. ఈ రెండు కేటిగిరీల కింద ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.1.50 లక్షలను సబ్సిడీగా ఇస్తుంది. ఈడబ్ల్యూఎస్ కేటిగిరీ కింద సాయం పొందేవారి వార్షికాదాయం రూ.3 లక్షల లోపు, ఎల్ఐజీ గ్రూపు కుటుంబాలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, ఎంఐజీ-1 కింద రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్య, ఎంఐజీ-2 కింద రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల ఆదాయం పొందే వారికి పీఎంఏవై వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ కేటిగిరీ లబ్ధిదారులకు రూ.2.20 లక్షలు, ఎల్ఐజీ కుటుంబాలకు రూ.2.67 లక్షలు, ఎంఐజీ-1 వారికి రూ.2.35 లక్షలు, ఎంఐజీ-2 వారికి రూ.2.30 లక్షల సబ్సిడీ వస్తుంది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో సొంత ఇళ్లని కొనుగోలు చేసే అవకాశం ఉన్నది. అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసేవారికి కూడా ఈ స్కీమ్ కింద ఆర్థికసాయం అందుతుంది. ఈ పథకంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని భవన నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి.

ఇక.. ప్రకాశం



కేంద్ర ప్రకటించిన బడ్జెట్‌లో ఉమ్మడి ప్రకాశాన్ని వెనుకబడిన జిల్లాలో జాబితాలో చేర్చి ప్రత్యేకంగా ఆదుకుంటామని హామీ ఇచ్చింది. గతంలో ఉమ్మడి ప్రకాశంలో భాగంగా ఉండిన చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలు ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్నాయి. కేంద్రం ప్రకటన వల్ల ఈ నియోజకవర్గాలకు నిధుల కేటాయింపులో సముచిత స్థానం దక్కనుంది. అదే విధంగా జిల్లాలోని వెనకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం కానున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాని వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చడం వెనక సీఎం చంద్రబాబు కృషి ఎంతో ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీని నెల వ్యవధిలోనే సీఎం హోదాలో కేంద్రం నుంచి రాబట్టడంపై మంత్రి గొట్టిపాటి ఆనందం వ్యక్తం చేశారు.

నిర్మాణాలు ఇక పరుగులు..

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అమరావతిలో పనులు ప్రారంభమయ్యాయి. తొలుత కంపచెట్ల తొలగింపుతో మొదలై మెల్లగా నిర్మాణ పనుల వైపుగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ప్రత్యేకంగా కేటాయింపులతో పాటు వివిధ ఏజెన్సీల ద్వారా సాయం చేయనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడంతో అమరావతికి నిధుల కొరత కొంత మేర తీరినట్లయింది. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన అద్భుత భవనాలు పూర్తయ్యే వీలు కలిగింది. దీంతో 90 శాతం పూర్తయిన ఆలిండియా ఉద్యోగుల భవనాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గృహ సముదాయాలు, గ్రూప్-4 ఉద్యోగుల భవన సముదాయాలు పూర్తవడానికి ఇక ఎంతో సమయం పట్టకపోవచ్చు. వాటితోపాటు మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలు కూడా వేగంగా పూర్తవుతాయి. కాగా ఐకానిక్, సచివాలయ టవర్స్ అసెంబ్లీ భవనాల నిర్మాణం కూడా చకచకా సాగనున్నది.

రైతుల కష్టాలు తీరినట్లే..



గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రాజధానికి భూములిచ్చిన రైతులను వేధించింది. వారికి ఏటా చెల్లించాల్సిన కౌలు కూడా చెల్లించలేదు. గడిచిన రెండేళ్లుగా రైతులకు ఇవ్వాల్సిన రూ.380 కోట్ల కౌలు చెల్లించక పోవడంతో రైతులు అప్పులపాలై అల్లాడుతున్నారు. పిల్లలచదువులకు ఫీజులు కూడా కట్టుకోలేని దయనీయ స్థితిలో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం నుంచి నిధులు రావడంతో వారు ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నారు. రాజధా నికి కేంద్ర నిధులు వస్తుండడంతో తమ కష్టాలు తీరనున్నాయని వారు ఆనందంలో ఉన్నారు.

కుట్రలకు తెర



అమరావతిపై గత ప్రభుత్వం చేసిన కుట్రలకు తాజా బడ్జెట్‌తో తెరపడింది. అమరావతిని కేంద్ర ప్రభుత్వం గుర్తించడమే కాకుండా, నిధులు కూడా కేటాయించింది. దీంతో రాష్ట్రానికి రాజధాని అమరావతేనని ఖాయమైపోయింది. ఇక ఏ ప్రభుత్వం వచ్చినా రాజధానిని మార్చడం అసంభవం. ఇక వారి కుట్రలకు కాలం చెల్లిపోయినట్లే. **- లంకా సుధాకరరావు, రైతు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు**

మా ఆవేదనకు సమాధానం



ఐదేళ్ల మా ఆవేదనకు సమాధానం దొరికింది. కేంద్రం బడ్జెట్ కేటాయించడం ద్వారా తాము రైతుల పక్షాన ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఐదేళ్ల మేం పడిన కష్టాలు ఇక తీరిపోతాయని భావిస్తున్నాం. మాకు రావాల్సిన కౌలు బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

- మాదాల పున్నయ్య, మందడం రైతు

అభివృద్ధికి ఢోకా లేదు



ఇప్పటి వరకూ గుర్తించని అమరావతికి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి ఎలాంటి ఢోకా ఉండదు.

- రామినేని చిన్నా, నెక్కల్లు రైతు



అడ్మిషన్లు.. అదుర్స్

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 75 శాతం ఇంజనీరింగ్ సీట్ల భర్తీ
- పక్క రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ చేరికలకు ఈ ఏడాది ఫుల్‌స్టాప్



గుంటూరు(విద్య), జూలై 23: ఒకవైపు ఊపందుకోనున్న అమరావతి నిర్మాణాలు.. మరోవైపు విశాఖలో ఐటీ కారిడార్ ఏర్పాటుకు ఏర్పాట్లు.. ఇంకోవైపు భారత్ పెట్రోలియం ఆయిల్ రిఫైనరీ సంస్థ ఏర్పాటుకు సన్నాహాలు.. రాష్ట్రంలో విద్యుత్ వాహనాల కంపెనీలు పెట్టుబడులపై ఆసక్తి.. ఈ నేపథ్యంలో పెరగనున్న ఉద్యోగ అవకాశాలతో పాటు ఈ ఏడాది తొందరగా ప్రారంభమైన ప్రక్రియ తో ఇంజనీరింగ్ అడ్మిషన్లకు ఊపువచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గతానికి భిన్నంగా ఈ ఏడాది తొలి విడత కౌన్సెలింగ్‌లోనే కొన్ని కళాశాలల్లో 75 శాతానికిపైగా సీట్లు, మరికొన్ని కళాశాలల్లో నూరుశాతం సీట్లు భర్తీ అయినట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తీసుకుంటున్న సానుకూల నిర్ణయాలే ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఒకప్పుడు లక్ష ర్యాంకు దాటిన వారే సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచిల వైపు చూసే పరిస్థితి ఉండేది. అయితే ఈ ఏడాది 26 వేల నుంచి 75 వేల ర్యాంకులు వచ్చిన వారు కూడా ఆయా బ్రాంచీల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇక కంప్యూటర్ ఆధారిత కోర్సుల్లో అయితే 2వేల ర్యాంకులు వచ్చిన వారి నుంచే ఏడాది చేరికలు ప్రారంభమయ్యాయి. తాజాగా ఇంజనీరింగ్ మొదటి, ద్వితీయ సంవత్సరాలు చదివే విద్యార్థులు తాము కోర్సులు పూర్తి చేసే సరికి రాష్ట్రంలో ఐటీ, కెమికల్, సివిల్, మెకానికల్ రంగాల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందనే భావనలో ఉన్నారు. విద్యుత్‌తో నడిచే వాహనాలు ద్విచక్ర, కార్లు తయారీకి రాష్ట్రంలో సానుకూల అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రా నిక్స్ రంగాల్లో ఉద్యోగాలు వస్తాయని ఇంజనీరింగ్ కళాశాలల యాజ మాన్యాలు చెబుతున్నాయి. ఇక భారత్ పెట్రోలియం వంటి సంస్థలు రాష్ట్రంలో రిఫైనరీ ఏర్పాటు చేస్తే వేల ఉద్యోగాలు వస్తాయి. ముడి ఆ యిల్ నుంచి పెట్రోల్, డిజిల్, ఇతర ఉప వస్తువుల తయారీలో కెమి కల్ ఇంజనీర్లదే కీలక భూమిక. అంతేకాకుండా రిఫైనరీ ఏర్పాటుతో మె కానికల్, ఐటీ బ్రాంచీల్లో ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు.

సివిల్ ఇంజనీర్లకు భారీ డిమాండ్..

నిర్మాణ రంగంలో కీలకమైన సివిల్ ఇంజనీర్లుకు త్వరలో భారీ డిమాండ్ ఏర్పడనుంది. అమరావతి రాజధానికి నిర్మాణాలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. రాజధానిలో నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చి వేగం పుంజుకోవడానికి కనీసం ఏడాది సమయం పడుతుంది. గతంలో ప్రతిపాదించిన అనేక ప్రాజెక్టులు పట్టాలెక్కితే రాజధాని ప్రాంతంలో సివిల్ ఇంజనీర్లకు భారీ డిమాండ్ ఏర్పడనున్నది. మరోవైపు రాజధాని నిర్మాణాలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగంలో నిర్మాణాలు వేగం పుంజుకోనున్నాయి. ఫలితంగా సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బిల్డర్లు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచీల్లో దాదాపు సీట్లు మొత్తం భర్తీ అయ్యే పరిస్థితి నెలకొంది.

అమరావతి అభివృద్ధి ఆగదు

- ప్రపంచ స్థాయి నగరాన్ని నాశనం చేసిన జగన్
- వెంకటపాలెం, మందడంలో మంత్రి నారాయణ పర్యటన

తుళ్లూరు, జూలై 23: అమరావతి అభివృద్ధి ఆగదని మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని గ్రామాలైన వెంకటపాలెం, మందడంలో సిటీస్ ఛాలెంజ్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. వెంకటపాలెంలో అంగన్‌వాడీ సెంటర్, ఈ-హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని, మందడంలో మూడు అంగన్వాడీ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం 2019లో రెండో దఫా వచ్చి ఉంటే అమరావతి ప్రపంచంలో మొదటి ఐదు నగరాల్లో ఒకటిగా ఉండేదన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చి అమరావతిని నాశనం చేసిందన్నారు. అయినా వీలైనంత త్వరగా అమరావతి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. అమరావతిని టాప్ ఒన్‌గా ఉండేలా చేద్దామని రూ.41వేల కోట్లతో అప్పట్లో పనులు చేపట్టగా ప్రభుత్వ మారడంతో అవన్నీ ఆగిపోయాయని గుర్తు చేశారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గ పరిధిలోని 24 గ్రామాల్లో సిటీ ఛాలెంజ్ ప్రాజెక్టులో 14 ప్రభుత్వ పాఠశాలు, 17 అంగన్వాడీ సెంటర్లు, అత్యాధునిక పర్యావరణ శ్మశాన వాటిక నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రూ.80.70కోట్లతో చేపట్టిన ఈ పనులన్నీ ఆగస్టు చివరికి పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఐదు కోట్ల మంది ప్రజారాజధాని అమరావతి అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందన్నారు. జంగిల్ క్లియరెన్స్ పనులు ఈ నెల 25 నుంచి శరవేగంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, అడిషనల్ కమిషనర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



వెంకటపాలెంలో ఈ -హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ , ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్

ఏపీలో పెట్టుబడులకు అనుకూలం

● జపాన్ రాయబారి సుజుకి హరోషితో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు

గుంటూరు, జూలై 23: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఎంతో అనుకూలమని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపుతుందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు జపాన్ రాయబారి సుజుకి హిరోషికి తెలిపారు. ఢిల్లీలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు జపాన్ రాయబారిని ప్రత్యేకంగా కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సత్సంబంధాలు, ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు, రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన అంశాలపై చర్చించారు.



సుజుకి హిరోషికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు



సమీక్షలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ వసంతరాయుడు

పారిశుధ్యం లోపిస్తే ఎంపీడీవోలపై క్రమశిక్షణా చర్యలు

● జడ్పీ సీఈవో వసంతరాయుడు హెచ్చరిక

గుంటూరు సిటీ, జూలై 23: గ్రామాల్లో పారిశుధ్యం లోపించినా, మంచినీటి సరఫరాపై ఫిర్యాదులు వచ్చినా ఎంపీడీఓలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్‌వీవీఎస్ వసంతరాయుడు హెచ్చరించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. తొలుత సీఈఓ ఉమ్మడి జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన మొదటిదశ పనులపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మరో 53 గ్రామాలు ఈ పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు. ఈ నెలాఖరులోగా ఆయా గ్రామాల నుంచి విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజు కాల్వలు తీయించాలని, ప్రతి 15 రోజులకొకసారి గ్రామాల్లోని వాటర్ ట్యాంక్ శుభ్రపరచాలని సీఈఓ అన్నారు. తాగేనీటిని తప్పని సరిగా క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఉన్న 15వ ఆర్థికసంఘం నిధులను వినియోగించుకోవాలని అన్నారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ జే మోహన్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీలు మధుసూదన్, దేబోరా తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ వైస్ చైర్మన్‌గా మైనేని



మైనేని సత్యనారాయణ

వేమూరు, జూలై 23: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా వేమూరు మండలం పెనుమర్రు గ్రామానికి చెందిన మైనేని సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రదీప్‌మిశ్రా ఆదేశాలపై సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి సునీల్‌వర్మ మంగళవారం సత్యనారాయణకు నియామకపత్రాలను పంపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తూ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించారన్నారు. తద్వారా మహిళలు, యువత, నిరుద్యోగులకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందించి వారి ఆర్థిక స్వావలంబనకు సహకరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఈ విధానం ద్వారా మోదీ ఆశయ సాధనకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నాడు-నేడు అవినీతిపై విచారణ చేయాలి

● శాసనసభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, జూలై 23: సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పేరుతో జగన్ చేసిన నాడు-నేడు పనుల్లో భారీ అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో ఫేజ్-1, 2 కింద రూ.9వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇంకా రూ.4,700కోట్లు ఖర్చు చేస్తే కానీ పథక నిర్మాణం పూర్తి కాదన్నారు. ఈ పథకం ద్వారా అద్భుతాలు జరిగినట్లుగా వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని ఎద్దేవా చేశారు. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ పేరుతో టెండర్లు పిలిచి స్థానికంగా కావలసిన ఫర్నిచర్ కొనుగోలు చేసి వైసీపీ నాయకులే ఖర్చుబెట్టారని ఆరోపించారు. పొన్నూరు పురపాలక సంఘంలో ఈ పనులను పరిశీలిస్తే పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. పురపాలక సంఘం పరిధిలో ఐదు పాఠశాలలు పరిశీలిస్తే ఈ అవినీతి బాగోతం వెలుగు చూసినట్లు చెప్పారు. శ్రీరామ మున్సిపల్ హైస్కూల్‌లో పథకం కింద రూ.26లక్షలు ఖర్చు చేసి పాత నిర్మాణాలకే రంగులు వేయటం, పాత టాయిలెట్లనే కొత్తగా నిర్మించినట్లు చూపారని ఆరోపించారు. కిందిస్థాయిలో పేరెంట్స్ కమిటీ, హెచ్ఎంలను ఈ పథకానికి బాధ్యులుగా ఎంచుకున్నారని ఆరోపించారు. వైసీపీ పెద్దలు రాష్ట్రంలో దోచుకుంటే, పట్టణాలు, మండలాల్లో స్థానిక వైసీపీ నాయకులు పాఠశాలలను పంచుకుని ఇష్టారాజ్యంగా పనులు చేయకుండా డబ్బులు డ్రా చేశారని ఆరోపించారు. పాఠశాలల్లో బాగున్న నాపరాయి ఫ్లోరింగ్‌ను తొలగించి గ్రానైట్ రాయిని ఎక్కువ ధరకు కొనుగోలు చేసి ఫ్లోరింగ్‌లు వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పనులకు ఉచిత ఇసుక అని చెప్పి కాంట్రాక్టర్లకు బిల్లులు చూపించి మినహాయింపులు ఇచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను వేదికగా చేసుకుని వైసీపీ పెద్దలు దోపిడీ చేశారని ఆరోపించారు. ఈ పథకం కింద ప్రారంభించిన భవనాలు అసంపూర్తిగా ఆగిపోయి అగమ్య గోచరంగా మిగిలిపోయాయన్నారు. సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే నరేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరారు.

రైతుల నుంచి ఫిర్యాదులొస్తే కమీషన్ ఏజెంట్ లైసెన్స్ రద్దు

● ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉన్నది ● కమీషన్, ఎగుమతి వ్యాపారస్థులతో మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు రైతులు తెచ్చిన మిరపకాయలను విక్రయించిన 24 గంటల్లో నగదు చెల్లించాలి. ఈ విషయంలో కమీషన్ వ్యాపారస్థులదే పూర్తి బాధ్యతని మార్కెటింగ్ శాఖ జేడీ, యార్డు పర్సన్ ఇన్‌చార్జ్ కాకుమాను శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ నెల 21వ తేదీన 'మిర్చి మాంద్యం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మంగళవారం మిర్చియార్డుకు వచ్చి ఆయన ఎగుమతి, కమీషన్ వ్యాపారస్థుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తమ సరుకు అమ్మిన వెంటనే తక్‌పట్టీ తప్పక తీసుకోవాలన్నారు. రైతులకు నగదు ఇచ్చే సమయంలో తక్‌పట్టీపై రైతు సంతకం విధిగా తీసుకోవాలని కమీషన్ వ్యాపారస్థులను ఆదేశించారు. రైతులకు చెల్లించాల్సిన అమ్మకపు సొమ్మును అదే రోజు చెల్లించాలన్నారు. ఎవరైనా రైతులకు నగదు చెల్లించలేదని ఫిర్యాదులొస్తే విచారణ జరిపి కమీషన్ ఏజెంట్ లైసెన్స్‌ని శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్ యార్డులో నిత్యం మైకు ద్వారా ప్రకటనలు జారీ చేస్తామన్నారు.



మిర్చి కమీషన్, ఎగుమతి వ్యాపారులతో సమావేశమైన మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

రైతులకు టోల్‌ఫ్రీ నెంబరుని కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. యార్డు వెలుపల జరిగే లావాదేవీలకు మార్కెట్ కమిటీకి సంబంధం ఉండదని చెప్పారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, అసోసియేషన్ల నాయకులు జుగిరాజ్ భండారి, సుధాకర్, అప్పిరెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాఫ్టుబాల్ ఉమ్మడి జిల్లా సీనియర్ జట్ల ఎంపిక



ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైన సీనియర్ సీఫ్టబాల్ క్రీడాకారుల బృందం

క్రోసూరు, జూలై 23: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ సాఫ్టుబాల్ చాంపి యన్ షిప్ కోసం బాలుర, బాలికల జట్లను మంగళవారం క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎంపిక చేశారు. బాలుర జట్టులో 18, బాలికల జట్టులో 18 మందిని ఎంపిక చేసినట్టు జిల్లా సెక్రటరీ శివపార్వతి తెలియజేశారు. బాలికల జట్టులో పీ జ్యోతిర్మయి, జీ నందిని, సీహెచ్ అనిత, షేక్ యాస్మిన్(క్రోసూరు సెయింట్ ఆన్స్), కే రోజా, ఈ లిడియ, కే దీవెన ఏంజల్, ఎన్ దుర్గామాధవి, జీ సునందిని, కే తేజశ్వని, హరిప్రియ, సీహెచ్ పావని, ఈ చంద్రిక, ఏ తిరుమల, పీ వర్షిక, బీ పూజిత, బీ సుప్రియ, చైతన్య ఎంపికైన వారిలో ఉన్నారు. బాలుర జట్టులో సాగర్ బాబు, బాబావలి, రాంబాబు, నాగూర్, ప్రేమ్‌కుమార్, షేక్ హయ్యూం, వీ సుజయ్, యూ నరేంద్ర, కే కుమార్, వీ సాయికుమార్, ఎం నల్య, కే సాగర్, ఎస్‌వీ నిషిత్ రెడ్డి, కే మంజిత్, పీ అమీర్, ఆర్ జేమ్స్, పీ హరినాగ సాయి, కే ఈశ్వర్ ఉన్నారు. ఎంపిక కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత, సాఫ్టు బాల్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ నరసిం హారెడ్డి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

పిడుగురాళ్ల, జూలై 23: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇరువురిపై పిడుగురాళ్ల పోలీసులు కేసు నమోదుచేశారు. పిడుగురాళ్లకు చెందిన బత్తుల శేఖర్ విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి కిలో గంజాయి రూ.3వేలకు కొనుగోలు చేసి పిడుగురాళ్లకు తీసుకొచ్చిన తరువాత పట్టణానికి చెందిన మురికిపూడి ప్రదీప్‌చంద్ర సహాయంతో చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి ఒక్కొక్క ప్యాకెట్ రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు అందిన సమాచారం మేరకు మురికిపూడి ప్రదీప్‌చంద్ర వద్ద 1080గ్రాముల గంజాయి లభించగా, స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు. మురికిపూడి ప్రదీప్‌చంద్రను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చారు. బత్తుల శేఖర్ పరారీలో వున్నట్లు పోలీసులు తెలిపారు.

చెప్పులు షాపు నిర్వాహకుడు ఆత్మహత్య

గుంటూరు, జూలై 23: స్థానిక అరండల్‌పేట నాలుగోలైన్‌లో చెప్పులషాపు నిర్వాహకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన ఎండ్లూరి శ్రీహరి(55) గీతాకేఫ్ ఎదురుగా చెప్పులషాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలురావడంతో అప్పులపాలయ్యాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ కొద్దిరోజులుగా స్నేహితుల వద్ద అంటుండేవాడు. కాగా ముత్యాలరెడ్డినగర్లోని ఇంటికి రంగులువేస్తుండటంతో భార్య బంధువుల ఇంటికివెళ్ళింది. దీంతో సోమవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీహరి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం ఇంటికి వచ్చిన భార్య గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. అరండల్‌పేట పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు. శ్రీహరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుంటూరు ఛానల్‌కు నిధులు కేటాయించాలి

● నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు



మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, జూలై 23: ప్రభుత్వం గుంటూరు ఛానల్‌కు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు కోరారు. మండలంలోని నాగులపాడులో సుబ్రహ్మణ్యేశ్వస్వామి దేవస్థానం వద్ద మంగళవారం నల్లమడ రైతు సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు తాగు, సాగునీటి సమస్యపై పోరాటం చేస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. గతంలో 5వేల క్యూసెక్కుల నీటి పారుదల సామర్థ్యంతో నల్లమడ ఆధునీకరణ చేపట్టేందుకు నిధులు కేటాయించారని, గత ప్రభుత్వం వాటిని రీటెండర్ల పేరుతో నిలుపుదల చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నల్లమడ వాగు ఆధునీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం గతంలో 21 రోజుల పాటు శాంతియుత నిరసనలు తెలియజేసిన రైతులు, మహిళలపై పోలీసు అధికారులు విచక్షణారహితంగా ప్రవర్తించి, అక్రమ కేసులు బనాయించారని, వీటిని ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, బండి నాగేశ్వరరావు, కాపు వెంకటసుబ్బారావు, లావు అంకమ్మచౌదరి, అడ్డగడ వెంకటేశ్వర్లు, మొవ్వా పెద్దన్న, బండి కామేశ్వరావు, కొల్లా రామన్, ఈదర భ్రమరాంబ, కొల్లా నిర్మల, లావు చౌడేశ్వరి, దొప్పలపూడి మంజూష, పాటింబండ్ల శ్రీనివాసరావు, కారుమంచి విజయ్‌కుమార్, బండి వెంకటశివరావు, ముత్తవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ ఎంపిక బీసీ వర్గాలకు సముచిత న్యాయం

● రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన



స్పీకర్ అయ్యన్నపాత్రుడిని సత్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

తెనాలి అర్బన్, జూలై 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడిని ఎంపికచేసి బీసీ వర్గాలకు సముచిత న్యాయం చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. మంగళవారం అమరావతిలో స్పీకర్‌ను కలిసి సత్కరించామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో శాసనసభ సమావేశాలు అనైతిక దూషణలతో జరిగాయని, వీటిపట్ల ప్రజలు ఎంతో మనస్తాపం చెందారని చెప్పారు. పవిత్ర దేవాలయంతో సమానమైన శాసనసభలో ప్రజలకు అవసరమైన అంశాలపై స్నేహపూర్వక వాతావరణంలో చర్చ జరగాల్సివుండగా అలాంటి వాతావరణమే గత ప్రభుత్వం కల్పించలేకపోయిందన్నారు. ఈ దుష్ట సంప్రదాయాన్ని ప్రజలు గమనించి తగినవిధంగా వారికి బుద్ధి చెప్పారని, తప్పు తెలుసుకోకపోగా అదే రీతిని వైసీపీ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. సభను హుందాగా నడిపి ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు స్పీకర్ కృషి చేయాలని కోరామన్నారు. బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీహరి (ఫైల్‌ఫొటో)

మాచర్ల రూరల్, జూలై 23: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పశువేములలో జరిగింది. గ్రామానికి చెందిన దోసపాటి శ్రీహరి (65) మంగళవారం తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా 11కేవీ విద్యుత్ వైరు తెగిపడింది. ఆ సంఘటనలో శ్రీహరి కాళ్లు, చేతులు, ఉదర భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న మరో రైతు దోసపాటి కనకయ్య విద్యుత్ లైన్‌మ్యాన్ హుస్సేన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే శ్రీహరి మృతిచెందాడు. విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు శ్రీహరి భార్య కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీహరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

56,693 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 54,687 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 56,693 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 14,534 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17500	334	9000	15500
నెంబరు. 5	9000	11000	నెంబరు. 5	10000	10500
273	11000	13000	273	12500	12500
341	8500	16000	341	8500	15000
4884	--	--	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18000	తేజ	9300	18200
బ్యాడిగి	8500	17000	బ్యాడిగి	9000	12700
దేవనూరుడీలక్స్	10000	15000	దేవనూరుడీలక్స్	8000	10000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11200

అమరావతికి

మంచిరోజులు

● పదేళ్ల నిరీక్షణకు తెర
● రాజధాని నిర్మాణానికి భారీగా కేంద్రం నిధులు
● బడ్జెట్లో రూ.15 వేల కోట్ల ప్రకటనతో పరుగులు పెట్టనున్న పనులు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి మహర్దశ పడుతోంది. గత ఐదేళ్లలో జగన్ నిర్వాకానికి బలై అరణ్యాన్ని తలపించిన నవనగరం ఇప్పుడు క్రమంగా జీవ కళ సంతరించుకుంటోంది. చంద్రబాబు ప్రభుత్వ చొరవ, తాజాగా కేంద్రం తోడ్పాటుతో జవసత్వాలు పొంది.. మహోన్నత నగరంగా రూపుదిద్దుకుంటుందన్న ఆశలు మొలకెత్తుతున్నాయి. అమరావతి నిర్మాణానికి కేంద్రం భరోసా ఇవ్వడమే కాకుండా.. బడ్జెట్లో భారీగా రూ.15 వేల కోట్లు ప్రకటించింది. రాబోయే కాలంలో మరిన్ని నిధులిస్తామని కూడా పార్లమెంటు వేదికగా భరోసా ఇచ్చింది. దీంతో గడిచిన ఐదేళ్ల పాలనలో చీకట్లు తప్ప వెలుగులు చూడని అమరావతిపై కాంతి రేఖలు ప్రసరిస్తున్నాయి. కష్టాలు, కన్నీళ్లు, ఆవేదనతో అల్లాడిన రాజధాని రైతులు కేంద్రం ప్రకటనతో ఆనందోత్సాహాలు వ్యక్తంచేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించగానే అమరావతిపై ఆశలు పెరిగాయి. అనుకున్నట్లుగానే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే రాజధాని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. జగన్ పాలనతో అప్పుల కుప్పగా మారిన రాష్ట్రంలో, ఒక్క రూపాయి కూడా నిధులు లేని పరిస్థితిలో అమరావతి పునర్నిర్మాణాన్ని సవాల్‌గా తీసుకున్న చంద్రబాబు.. అందుకోసం పకడ్బందీగా అడుగులు వేశారు. రాజధాని నిర్మాణ పనులు కొనసాగిస్తూనే, అందుకు కావలసిన నిధులను కేంద్రం నుంచి కూడా రాబట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు. రెండు సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలిసి నిధులు సాధించేందుకు కృషిచేశారు. ఆయన ప్రయత్నాలు ఫలించి కేంద్రం తాజాగా రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించింది.

ఇక శరవేగంగా..!

రాజధాని అమరావతి శంకుస్థాపనకు వచ్చిన సమయంలో ప్రధాని మోదీ రాజధాని నిర్మాణానికి రూ.10 వేల కోట్లు ఇస్తామన్నారు. కానీ రూ.1,500 కోట్లే ఇచ్చారు. అది అమరావతి నిర్మాణంపై తీవ్ర ప్రభావం చూపింది. రాష్ట్రప్రభుత్వంపై మోయలేని భారం పడింది. అయినప్పటికీ నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు.. ప్రభుత్వ కార్యాలయ, సిబ్బంది భవన సముదాయాల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. కానీ 2019లో జగన్ సీఎం కావడంతో రాజధాని పనులకు గ్రహణం పట్టింది. మూడు రాజధానుల ముచ్చటతో అమరావతిని పాడుపెట్టాలని చూశారు. ఏకైక రాజధానిగా అమరావతే ఉండాలని ఉద్యమానికి దిగిన రైతులు, మహిళలపై లెక్కలేనన్ని కేసులు పెట్టారు. వారిపై పోలీసులు, వైసీపీ శ్రేణులతో దాడులు చేయించారు. చివరకు చట్టబద్ధంగా వారికి రావలసిన కౌలు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. ఈ దశలో సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన టీడీపీ కూటమి గద్దెనెక్కింది. రాజధాని నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు కేంద్ర సాయంతో.. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన ప్రభుత్వ భవన సముదాయాల నిర్మాణాలకు నిధుల సమస్య లేకుండా పోయింది. శాసనసభ, సచివాలయ భవన సముదాయం, ఐకానిక్ టవర్స్ వంటి అతి కీలక భవనాల నిర్మాణానికి కూడా మార్గం సుగమమైంది. రైతులను వెంటాడుతున్న కౌలు సమస్యలూ పరిష్కారం కాబోతున్నాయి. జగన్ పార్టీ నేతలు ధ్వంసం చేసిన రోడ్ల పునర్నిర్మాణానికి అవకాశం లభించింది. తాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల కల్పన సహా అనేక పనులు నిరాటంకంగా సాగుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

బాబు చొరవతో మహర్దశ



బడ్జెట్‌లో కేంద్రం అమరావతికి రూ.15 వేల కోట్లు ప్రకటించడం ఎంతో ఆనందంగా వుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడే అమరావతిపై ఆశలు చిగురించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో వచ్చే ఐదేళ్లలో రాజధానికి మహర్దశ పడుతుంది.

\- పువ్వాడ సుధాకర్, కన్వీనర్, అమరావతి జేఏసీ

కుట్రలు వీగిపోతాయి..



ఐదేళ్లు కష్టాలు పడ్డ రైతుల కళ్లలో ఈరోజు ఆనందం కనిపిస్తోంది. రాజధానికి భూములిచ్చి తప్పు చేశామని బాధపడేలా గత ప్రభుత్వం వారిని వేధించింది. ఇప్పుడు రాజధానికి కేంద్రం సాయంతో రైతుల కష్టాలన్నీ తీరిపోతాయి. కేంద్రం చొరవతో అమరావతిపై కుట్రలన్నీ వీగిపోతాయి.

\- పులి చిన్నా, దళిత జేఏసీ నేత

మా కష్టాలు తీరిపోయినట్లే...



గత ప్రభుత్వంలో మేం ఎన్నో కష్టాలు పడ్డాం. కౌలు కూడా ఇవ్వకుండా వేధించింది. మా భూములు మాకు కాకుండా చేయాలని చూసింది. ఇప్పుడు కేంద్రమే అమరావతిని గుర్తించి సాయం ప్రకటించింది. ఇక మా కష్టాలు తీరిపోయినట్లే!

\- కొల్లి అరుంధతి, మహిళా జేఏసీ నేత

అమరావతికి రూ.15వేల కోట్ల కేటాయింపు హర్షణీయం

● ప్రధానికి రెవెన్యూ మంత్రి అనగాని కృతజ్ఞతలు

రేపల్లె, జూలై 23: ప్రజానీకం ఎన్నికల్లో ఇచ్చిన మహోన్నతమైన తీర్పును గౌరవించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రానికి నిధులు కేటాయించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్రప్రభుత్వం తమ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి నిధులు కేటాయించటం హర్షదాయకమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించటం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించటం రాష్ట్ర ప్రజల తరుపున ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణానికి సహాయం, గ్రామీణాభివృద్ధి పథకాలకు రూ.2.66లక్షల కోట్లు ప్రకటన, ఆక్వాసాగుకు ప్రోత్సహం పూర్వోదయ పథకం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక ప్రాజెక్టుల మంజూరు రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. నీరు, విద్యుత్, రైల్వే రోడ్ల ప్రాజెక్టులకు దశల వారీగా నిధులు, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపకరిస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, తమకేమీ అధికార పదవులు వద్దని కేంద్రంతో చెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాష్ట్రంవైపు చూసేలా చెయ్యటంతో రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం బడ్జెట్ ద్వారా ఈ స్థాయిలో నిధులు మంజూరు చెయ్యటం సాధ్యమైందన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి నిధుల కేటాయింపుపై హర్షం

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 23: రాజధాని అమరావతి అభివృద్ధికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15వేల కోట్లు బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించడంపై గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణం కోసం రూ.15వేల కోట్ల కేటాయింపుతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రాంతంలో వెనుకబడిన జిల్లాలకు తగిన సాయం ప్రకటించడం సంతోషదాయకమన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం నుండి సహకారం వుంటుందని, విశాఖ-చెన్నై కారిడార్, హైదరాబాద్ - బెంగుళూరు కారిడార్‌ల అభివృద్ధితో పాటు విద్యుత్, రైల్వే, రహదారుల అభివృద్ధికి దశల వారీగా నిధుల కేటాయింపుతో రాష్ట్రం అభివృద్ధి దిశగా మరింత ముందుకు వెళ్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీపై ప్రత్యేక దృష్టి

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి ప్రకటించిన వరాలు ఐదేళ్ల సమస్యలకు జవాబు ఇచ్చేలా విశ్వాసం కలిగించిందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలసి మాట్లాడుతూ ఎన్నికల్లో ఏపీకి న్యాయం చేస్తానని ప్రధాని మోదీ చెప్పారని, చెప్పినవిధంగానే అమరావతికి రూ.15వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించటం అభినందనీయమన్నారు.

ప్రకాశం బ్యారేజి గేట్లు మూసివేత

● డెల్టా కాలువలకు 7,700 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, జూలై 23: వాగుల నుండి వచ్చే వరద ఉధృతి తగ్గడంతో మంగళవారం ప్రకాశం బ్యారేజి గేట్లను మూసివేసినట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర తదితర వాగుల నుండి 7వేల 700 క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందని తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 7వేల 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేరస్తులకు నిలయంగా మారిన వైసీపీ

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రౌడీలకు, గుండాలకు కేబినెట్ ర్యాంక్ పదవులను కట్టబెట్టి పార్టీని బతికించుకునే స్థాయికి వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి దిగజారిపోయాడని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేయటంతో పాటు పలు హత్యలు, హత్యాయత్నాలు, సెటిల్ మెంట్లతో సంబంధమున్న లేళ్ళ అప్పిరెడ్డిని పెద్దల సభగా చెప్పుకునే శాసనమండలికి ప్రతిపక్షనేతగా చేయటం సిగ్గుచేటన్నారు. సొంత పార్టీ నేతలే ఈ నియామకాన్ని చూసి జగన్‌రెడ్డి మానసిక పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారని అన్నారు. గుంటూరు మార్కెట్ యార్డును తగలబెట్టటమే కాక, అప్పటి ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు బాధిత రైతులను పరామర్శించటానికి వచ్చినప్పుడు ఆయనపై దాడికి ప్రయత్నించిన నేరస్తుడు అప్పిరెడ్డి అని అన్నారు. దళిత యువతి నల్లపు రమ్య గుంటూరులో దారుణ హత్యకు గురైతే పరామర్శించటానికి వచ్చిన నారా లోకేశ్‌పై తన ఆకురౌడీలతో రెచ్చిపోవటమే కాక సంగం డెయిరీ ఛైర్మన్‌గా ఉన్న ధూళిపాళ్ల నరేంద్రపై దాడి చేసి, ఆయన కారు అద్దాలు ధ్వంసం చేసిన చరిత్ర అప్పిరెడ్డిదని అన్నారు. జగన్‌రెడ్డి రాకతో రాజకీయాలు భ్రష్టు పట్టాయని, హత్యలు చేస్తే ఎంపీ, ఎమ్మెల్సీ పదవులు, బూతులు తిడితే మంత్రి పదవులు, దొమ్మీలు, భూ ఆక్రమణలు చేస్తే రాజ్యసభ పదవులు ఇచ్చే కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టిన పరమ నీచుడు జగన్‌రెడ్డి అని అన్నారు.

భవిష్యత్‌లో ఈవీ ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు

● ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సందీప్

గుంటూరు(విద్య), జూలై 23: భవిష్యత్‌లో ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు, భారీ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వీ.సందీప్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ-వాణి (వైబ్రంట్ అడ్వోకసీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ ల్యాంగ్వేజెస్) ఆర్థిక సహకారంతో 'విద్యుదీకరణ చలనశీలత: ఎలక్ట్రిక్ వాహనాలతో భవిష్యత్‌ను రూపొందించడం' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించి వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ డాక్టర్ వీ.సందీప్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వెహికల్స్‌దేనని అన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగాలలో విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్స్ డిజైనింగ్‌ను ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలు కలిసి పని చేయాలన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ బ్యాటరీ పనితనం, స్టోరేజ్ గురించి విద్యార్థులకు వివరించారు. బ్యాటరీ నుంచి వచ్చే వ్యర్థాలను విసర్జించడం ఒక సవాల్ అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఫణీంద్ర కుమార్, ఆయా విభాగాల డీన్లు, వివిధ విభాగాధిపతులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య సందీప్

నేడు ఆర్‌వీఆర్ జేసీలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

● హాజరుకానున్న ఇస్రో శాస్త్రవేత్తలు

గుంటూరు(విద్య), జూలై 23 : స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నుంచి ఇస్రో ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి షార్ శాస్త్రవేత్తలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. చంద్రయాన్-3 చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం, ఇస్రో, శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, నేతృత్వంతో ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల సహకారంతో నిర్వహించనున్న తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం బుధ, గురువారాల్లో విజయవంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు. స్పేస్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షార్ శ్రీహరికోట, సైంటిస్ట్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ (ఇన్‌చార్జి) ఆచార్య కె రామ మోహనరావు, షార్ డిప్యూటీ డైరెక్టర్ టి.ఎస్.రఘురాం తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

స్వయం ఉపాధితో యువతకు ఆర్థిక స్వావలంబన

● యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్

ప్రత్తిపాడు, జూలై 23: స్వయం ఉపాధి ద్వారా ప్రతి ఒక్కరూ ఆర్థిక స్వావలంబన సాధించగలరని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ బ్రహ్మానందకుమార్ తెలిపారు. మండలపరిధిలోని తుమ్మలపాలెంలో యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ద్వారా మహిళలకు నెల రోజు ల పాటు శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను బ్రహ్మానందకుమార్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ద్వారా అనుభవం గల శిక్షకులతో మహిళలకు కుట్టు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణలో పాల్గొనే మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ సామగ్రిని అందజేయడంతో పాటు శిక్షణానంతరం బ్యాంకు ద్వారా రుణ సదుపాయాలు కూడా కల్పిస్తున్నామన్నారు. మహిళలను సమీకరించిన వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థను ఆయన అభినందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గుంటుపల్లి రాంబాబు, వాటర్ ఎయిడ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నర్రావుల సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం



చిల్లపల్లి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థినులు

మంగళగిరి సిటీ, జూలై 23: గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిందని జనసేనపార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2020-23 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు తమకు జరిగిన అన్యాయంపై మంగళవారం చిల్లపల్లిని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మేలు చేసే విధంగా ఐఏఎస్, ఐపీఎస్ కోర్సుతోపాటు ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను చంద్రబాబు ప్రవేశపెట్టారని, జగన్ ప్రభుత్వంలో రీఎంబర్స్‌మెంట్ సౌకర్యం ఎత్తి వేశారని విమర్శించారు. తమ కోర్సు పూర్తయిన తరువాత సర్టిఫికెట్లు అడి గితే ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తించదని, సర్టిఫికెట్లు పొందాలంటే ఫీజులు పూర్తిగా చెల్లించాలని వర్సిటీ యాజమాన్యం తెలిపిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు సచివాలయ ఉన్నతాధికారులను కలిసి విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని వాపోయారు. తమ సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు.

ప్రతి కార్యకర్తకు చేరువయ్యేలా సభ్యత్వ నమోదు

ప్రతి కార్యకర్తకు చేరువయ్యే విధంగా జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదును చేపడుతున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీని వాసరావు తెలిపారు. మంగళగిరి జనసేన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు చేరువకావాలనే సంకల్పంతో ఈ నెల 24వ తేదీ నుంచి క్రియాశీల సభ్యత్వ నమోదు కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు చెప్పా రు.

● అమరావతి రాజధానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించడంపై జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం అమరా వతి అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అమరావతి అభివృద్ధి చెందితేనే ఏపీ అభివృద్ధి చెందుతుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం హాజరు నమోదు కావాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(విద్య), జూలై 23 : ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థుల హాజరు నూరుశాతం వుండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విద్యా శాఖాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంఈఓలు, డిప్యూటీ ఎంఈఓలు, ప్రధానోపా ధ్యాయులతో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు కలెక్టర్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ సర్వేలో వివరాలు నమోదు కాని వాటిపై విద్యా శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డబల్ ఆధార్ వున్న వారి వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి విద్యాశాఖ సైట్‌లో అప్డేట్ చేసేలా రాష్ట్ర స్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా వంద శాతం స్కూల్ కు హాజరవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీలు నాణ్యమైన సరుకు అందించాలని, గుడ్ల నాణ్యతను పరిశీలించాలని, మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు అందించాలని, మెనూ ప్రకారం రాగి జావను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, డీఈఓ కార్యాలయం ఏడీ నిర్మలారాణి, డీవైఈఓ గుంటూరు, తెనాలి పి.వేంకటేశ్వరరావు, శాంత కుమారి, సీనియర్ హెచ్ డీసీఈబి సెక్రెటరీ తిరుమలేష్, ఎంఈఓలు, డిప్యూటీ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 34,730.55 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధికి, యువతను, మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు సహకరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు విరివిగా రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ నాగలక్ష్మి అధ్యక్షతన బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశం, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం జరిగింది. సమావేశంలో రూ.34,730.55 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరం రుణ ప్రణాళికను కలెక్టర్ విడుదల చేశారు. ఇందులో ప్రాధాన్య రంగాలైన వ్యవసాయానికి సంబంధించి స్వల్పకాలిక రుణాలు, టర్మ్ రుణాలు, మౌలిక సౌకర్యాల కల్పనకు, డ్వాక్రా రుణాలకు, పరిశ్రమలకు సంబంధించి ఎంఎస్ఎంఈలు, ఎగుమతులకు రూ.24,501.93 కోట్లు, ప్రాధాన్యం లేని రంగాలకు రూ.10,228.62 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కౌలు రైతులకు రూ.180 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా రాజధాని ప్రాంతంలో భాగమైనందున నిరుద్యోగ యువతకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్థానిక అవసరాలకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు నైపుణ్యాలపై శిక్షణ అందించటంతో పాటు, ఎంఎస్ఎంఈల స్థాపనకు రుణాలు అందించాలన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమలకు పీఎంఎఫ్ఎంఈ ద్వారా రుణాలు మంజూరు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని మంగళగిరి చేనేత క్లస్టర్‌తోపాటు ఇతర ప్రాంతాల్లోని చేనేత పరిశ్రమలలో కార్మికుల నైపుణ్యాలు మెరుగుపర్చుకోవటానికి, ఆధునిక వస్త్రాల ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పాటుకు చేనేతలకు ముద్రా పథకం ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ, విశ్వకర్మ పథకం రుణాలు బ్యాంకుల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు మంజూరు చేయాలన్నారు. టిడ్కో, హౌసింగ్ రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్ యూనియన్ బ్యాంక్ ఇండియా రీజినల్ హెడ్, డీజీఎం ఎస్.జవహర్, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, ఆర్బీఐ ఎల్డీఓ నవీన్, నాబార్డు డీడీఎం జీ.శరత్ బాబు, కెనరా బ్యాంకు ఆర్ఎం రాంమోహన్, ఎస్బీఐ ఆర్ఎం సత్య స్వరూపిణి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్ఎం పరిమళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, జౌళి శాఖ ఏడీ వనజ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన కలెక్టర్

గుంటూరు సిటీ, జూలై 23 : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి నెలా తనిఖీలలో భాగంగా మంగళవారం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను, అనంతరం ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్‌లో వీవీపాట్స్ భద్రపరచిన గోడౌన్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తనిఖీ చేశారు. సీసీ టీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్ బుక్‌ను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలపై ఎక్స్‌పైరీ తారీఖును ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రోజా, గుంటూరు ఆర్డీవో పి.శ్రీకర్, ఫిరంగిపురం తహసీల్దార్ రాఘవేంద్రరావు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బిల్లా సునీల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి తాతా సేవా కుమా ర్, బీఎస్పీ తరఫున చిరతనగండ్ల వాసు, బీజేపీ నుంచి పద్మనాభరావు, టీడీపీ తరఫున నరసింహారావు, సీపీఐ తరఫున వెంకటేశ్వర్లు, కలక్టరేట్ ఏవో విజయ్ కుమార్, ఎలెక్షన్ సెక్షన్ పర్యవేక్షకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నాంది

● బీజేపీ తూర్పు కన్వీనర్ డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు(తూర్పు), జూలై 23 : కేంద్ర బడ్జెట్‌లో గణనీయంగా నిధులు కేటాయించి ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నాంది పలికారని బీజేపీ తూర్పు కన్వీనర్ డాక్టర్ ఉమాశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రూ.15 వేల కోట్లు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేస్తూ పోలవరంను పూర్తి చేసే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. బడ్జెట్‌తో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

అంధకారం నుంచి అభివృద్ధి దిశగా ఏపీ

● మోదీ, చంద్రబాబు, పవన్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం

గుంటూరు, జూలై 23: ఐదేళ్ళ వైసీపీ పాలన రాష్ట్ర చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోతుందని, ఎన్‌డీఏ కూటమి అధికారంతో రాష్ట్రం అంధకారం నుంచి అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాలు ప్రకటించటంతో శ్రీనివాసరావుపేట అచ్చయ్యడాబా సెంటర్‌లో మంగళవారం ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు వారు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జూపూడి భవానీ, పద్మ, సయ్యద్ షర్ఫుద్దీన్, గడ్డం రోశయ్య, ఇల్లా చిరంజీవి, సయ్యద్ చాంద్, కరీం, పూసల సీను, కోలా మల్లి, ఫణి, రఫి, బాలకృష్ణ, మాదాసు శేఖర్, కుమారస్వామి, రామకృష్ణ, కోటి తదితరులున్నారు.



మోదీ, చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం : సీపీఎం

గుంటూరు(తూర్పు), జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి రాజధాని నిర్మాణం కోసం వివిధ సంస్థల ద్వారా రూ.15 వేల కోట్లు సమకూర్చుతామని చెప్పడం బాధాకరమని అన్నారు. ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు, పోలవరం నిర్మాణానికి, నిర్వాసితులకు నష్టపరిహారం వంటి అంశాలకు నిధులు కేటాయించకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

మాటలు జాస్తి.. కేటాయింపులు నాస్తి : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), జూలై 23 : కేంద్ర బడ్జెట్లో రాష్ట్ర అభివృద్ధి విషయంలో మాటలు జాస్తి.. కేటాయింపులు నాస్తి అన్న చందంగా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకి, విశాఖ, చెన్నై కారిడార్ విషయంలో సానుకూలమైన మాటలు చెప్పారే తప్ప బడ్జెట్ కేటాయింపులో నిధులు చూపకపోవడాన్ని చూస్తే కాలయాపన చేసే ప్రమాదం ఉందన్నారు. అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు కేటాయింపులపై హర్షం వ్యక్తం చేశారు. 500 పరిశ్రమల్లో 4 కోట్ల ఉద్యోగాలు అన్న మాట నిరుద్యోగ యువతను మోసగించటమేనని అన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అనివార్యమైన స్థితి బీజేపీ ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు.

రాష్ట్రానికి మరోసారి వివక్ష: లింగంశెట్టి

గుంటూరు, జూలై 23 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి వివక్ష కొనసాగిందని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అరకొర నిధులతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయమే జరిగిందన్నారు. రాజధాని నిర్మాణానికి ప్రకటించిన రూ.15 వేల కోట్లు అప్పుగానా, గ్రాంటుగానా అన్న దానిపై స్పష్టతలేదన్నారు. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా ఊసేలేదన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 23: విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా డి-4 సెక్షన్ పరిధిలోని ఉద్యోగనగర్, కృష్ణబాబు కాలనీ, ఎస్‌వీఎన్ కాలనీ, నేతాజీనగర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

150 లీటర్ల కలుపుమందు స్వాధీనం



తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గుంటూరు సిటీ, జూలై 23 : గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న పలనాడు పార్శిల్ సర్వీసులో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో హైదరాబాద్ నుంచి వచ్చిన గ్లైసిల్ కలుపు మందు ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా వచ్చినట్లు గుర్తించారు. రూ.24 వేల విలువ చేసే మందును స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలలో ఏఓ లు ఓ సునీల్, బి గౌతమ్ ప్రసన్న పాల్గొన్నారు.

దుగ్గిరాల రోడ్లకు మహర్దశ

● 20 ఏళ్ల శాశ్వత ప్రాతిపదికన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం

దుగ్గిరాల, జూలై 23: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో గ్రామం మొత్తం 20ఏళ్ల శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఈ జీ బ్రహ్మయ్య తెలిపారు. మంత్రి నారా లోకేశ్, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కల్యాణ్‌ల ఆదేశాలతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో అంతర్జాతీయంగా పసుపునకు ప్రసిద్ధి చెందిన దుగ్గిరాలకు మహర్దశ పట్టనుంది. దోమలు, దుర్వాసనకు చోటు లేకుండా 32కి.మీమేర గ్రామమంతా భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు నాలుగు రోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. మరోవైపు రూ.4.07కోట్లతో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం, ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇదిలా ఉండగా మచ్చుకైనా మట్టిరోడ్డు కని పించకుండా గ్రామమంతా సీసీరోడ్ల నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీ రాజ్ జిల్లా అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. పంచాయతీ రాజ్ విశ్రాంత ఎస్ఈలు నరసింహారావు, ప్రకాష్‌రెడ్డిలు సలహాదారులుగా రోడ్ల నిర్మాణానికై సర్వే ప్రారంభించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఎస్ఈ బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రస్తుతమున్న నేల తీరును తెలుసుకునేందుకు గానూ మట్టి నమూనాలను సేకరించి, కనీసం 20 ఏళ్ళపాటు చెక్కు చెదరకుండా దుగ్గిరాలలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం పరిశీలిస్తున్నామన్నారు. సమావేశంలో ఈఈ ముత్యం, సాంబశివరావు, ఏఈ రమేష్‌రెడ్డి, భాస్కరరావు, సచివాలయ ఇంజనీర్లతో పాటు దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, కో-ఆర్డినేటర్ గద్దె వాసు, టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, నక్కా చిరంజీవి, చంటి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సామియాపాల్‌కు బంగారు పతకం



కోచ్ సురేష్‌తో సామియాపాల్

గుంటూరు(విద్య), జూలై 23 : ఇటీవల చెన్నైలో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక సిమ్స్ స్కూల్‌కు చెందిన ఒకటవ తరగతి విద్యార్థిని ఇంటూరి సామియాపాల్ అండర్ 7 కటా విభాగంలో బంగారు పతకం సాధించింది. ఎన్టీఆర్ స్టేడియం కోచ్ కె.సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

నారా లోకేశ్ పంపిన పెళ్లికానుక అందజేత

తాడేపల్లి, జూలై 23: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన షేక్ బాజి షమీనా గార్ల కుమారుడు షేక్ సలీంబాషా-హుస్సేన్ బేగంల వివాహాన్ని పురస్కరించుని రాష్ట్ర ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లి కానుకను వడ్డేశ్వరం గ్రామంలో మంగళవారం టీడీపీ నేతలు నూతన వధూవరులకు అందజేసి పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఈపూరి బాబు, మద్దినేని సుబ్రహ్మణ్యం, కత్తిక శ్రీరాములు, వడ్డేశ్వ రం అబ్రహం, చావలి సురేష్, గుంపెన నాగేశ్వరరావు, జొరుగ దాసు, రాజా రావు, షేక్ ఇమాంసా, భీముడు, త్రినాథ్, సుగుణాకర్, రత్తయ్య, అన్వర్ బాషా, సురేష్, అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

236 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, జూలై 23: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 236 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయిం చారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,000 గరిష్ఠ ధర రూ.13,000 మోడల్‌ధర రూ.12,651 పలికాయి. కాయ కనిష్ఠ ధర రూ. 12,000, గరిష్ఠధర రూ.12,900, మోడల్‌ధర రూ.12,651లు పలికాయి.

ఆంధ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



గళ్లా మాధవి

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. గుంటూరు లోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రుడికి 2014లో అండ గా నిలిచిన టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చారని అన్నారు. దురదృష్టవ శాత్తు 2019లో అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్ర అభివృద్ధికి పాతరవేసిందని విమర్శించారు. తిరిగి 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు వెన్నుదన్నుగా నిలిచే విధంగా అధిక కేటాయింపులు జరిగే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేశారని అన్నారు. ఏపీ రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నట్లు కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం, ప్రత్యేక కార్యక్రమాల్లోనూ ఏపీకి ప్రాధాన్యమిస్తామని తెలపడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై ఏపీ ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి బడ్జెట్‌లో రూపకల్పన చేశారని, ఆంధ్రుల ఆకాంక్షల కోసం చంద్రబాబు చేసిన కృషి వల్లే బడ్జెట్‌లో ఏపీకి న్యాయం జరిగిందన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి సూచికగా కేంద్ర బడ్జెట్

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సూచికగా కేంద్ర బడ్జెట్ ఉందని, రాజధాని నిర్మాణానికి 15వేల కోట్ల రూపాయలు కేటాయించడం హర్షనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి విజనరీ నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు రాజనీతిజ్ఞత, కేంద్రంతో సత్సంబంధాల వలనే సాధ్యమైందని ఆయన అన్నారు. పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సూచిక లాంటిదన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రలో, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కేంద్ర బడ్జెట్లో కేటాయించడం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తయ్యేలా హామీ ఇవ్వడం విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్ నోడ్‌లకు ప్రత్యేక సహాయం ప్రకటించడం వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

రాష్ట్ర ప్రజల కల నెరవేరబోతోంది

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



డేగల ప్రభాకర్

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక సాయం ప్రకటించడంతో రాష్ట్ర ప్రజల కల నెరవేరబోతోందని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత జగన్ రెడ్డి ప్రభుత్వంలో అరాచక, ఆటవిక పాలనలో రాష్ట్రం ఏమైందో, రాష్ట్ర పరిస్థితి ఎంతలా దిగజారిందో ప్రజలందరూ చూశారన్నారు. అమరావతిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు ఇవ్వడంతో రాజధాని పనులను పరుగులు పెట్టించవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కేంద్రం మరోసారి స్పష్టంగా హామీ ఇవ్వడం శుభ పరిణామమన్నారు. ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి స్కీముకు నిధులిస్తామని చెప్పడం రాష్ట్ర ప్రగతికి తోడ్పడుతుందన్నారు. ఏపీలో ఏర్పడిన కొత్త ప్రభుత్వానికి కేంద్రం ప్రకటనలు ఆర్థిక తోడ్పాటు ఇస్తుందని తెలిపారు. గత 5 సంవత్సరాల్లో ఏపీకి జరిగిన నష్టాన్ని కేంద్ర బడ్జెట్ ద్వారా భర్తీ చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. జగన్ పాలనలో ఏపీ ఐదేళ్ల పాటు రాజధాని లేని రాష్ట్రంగా ఉందని, రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని విమర్శించారు.

రాజధానికి కేంద్రం నిధులపై హర్షం

● అమరావతి రైతుల పోరాటం మరువలేనిది

● జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్



రాజధాని అమరావతికి శంకుస్థాపన ప్రదేశంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ జిల్లా, మండల నాయకులు

తుళ్లూరు, జూలై 23: ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రం బడ్జెట్‌లో 15వేల కోట్ల రూపాయలు కేటాయించటంపై ఆంధ్రప్రదేశ్ ఆనందపడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాప న చేసిన ఉద్దండ్రాయునిపాలెం ప్రదేశంలో మోదీ చిత్రపటం ఉంచి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ అమరావతి రైతులు, మహిళలు, రైతు కూలీలు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు తొడెంపు శివరామ గుప్తా, జిల్లా అధికార ప్రతినిధి తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సరకా కుమార్ గౌడ్, తుళ్లూరు మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు, నాయకులు మార్త నరేంద్రబాబు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

● కళ్లం రాజశేఖర్‌రెడ్డి

తాడేపల్లి, జూలై 23: అమరావతి రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో నిధుల కేటాయించడం శుభపరిణామమని గుంటూరు పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం పెనుమాకలో విలేకరులతో మాట్లాడుతూ మోదీ, నిర్మలా సీతారామన్, చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రణాళికా విభాగం ఏసీపీగా అంజనా జేమ్స్

మంగళగిరి, జూలై 23: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా అంజనా జేమ్స్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డీటీసీపీ కేంద్ర కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధు లు నిర్వహిస్తున్న అంజనా జేమ్స్ డిప్యూటేషన్‌పై వచ్చారు. ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన అంజనా జేమ్స్‌ను డీసీపీ అశోక్‌కుమార్, టీపీవో రమేష్, టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

నేతన్న సర్కిల్‌కు మెరుగులు దిద్దాలి

మంగళగిరి సిటీ, జూలై 23: చినకాకాని ఎన్నారై వైజంక్షన్‌లోని నేతన్న సర్కిల్‌కు మెరుగులు దిద్ది ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం నాటికి సిద్ధం చేయాలని చేనేత పరిరక్షణ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంటీఎంసీ కమిషనరు అలీం బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. నేతన్న విగ్రహం పరిసరాలను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మాచర్ల సుధాకర్, గుత్తికొండ ధనుంజయ రావు, సహాయ కార్యదర్శులు రావెల శివసత్యనారాయణ, పిల్లల మర్రి బాల కృష్ణ, కమిటీ సభ్యులు రామనాథం పూర్ణచంద్రరావు, కూరపాటి కోటేశ్వరరావు, డోగిపర్తి రామారావు, జంజనం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ అలీం బాషాకు అభినందనలు

మంగళగిరి, జూలై 23: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అలీం బాషాను ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో ఎన్జీవో అసోసియేషన్ మండల అధ్యక్షుడు కే.శ్రీరాములు, కార్యదర్శి డి.బాలనాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

శాకాంబరిగా దుర్గాదేవి


శాకాంబరిదేవి అలంకారంలో దుర్గాదేవి

తెనాలి, మారీసుపేట జూలై 23: దుర్గాదేవి అమ్మవారు శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల పరిధిలోని కొలవరంలోని దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఆషాడమాసాన్ని పురస్కరించుకొని దుర్గాదేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన వివిధ రకాల కూరగాయలతో ఆలయ అర్చకులు శాకాంబరిదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జాజుల వెంకటేశ్వరావు, దక్కిరాజు మణికంఠ వర్మ, జగదీష్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట జూలై 23: పట్టణంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని తెలుగునాడు ఆటో యూనియన్ సభ్యలు నిర్వహించారు. స్థానిక మారీసుపేటలోని ఓవర్ బ్రిడ్జి వద్ద మంగళవారం తెలుగునాడు ఆటోయూనియన్ సభ్యుడు కొల్లిపర అనిల్‌కుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి యూనియన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆలపాటి నాగభూషణం, సైకం చిన్నారి, చెన్నుపాటి శ్రీను, కోగంటి గిరి, దుర్గా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


మృతుడు రవితేజ తల్లిని పరామర్శిస్తున్న మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ రాజకుమారి, ముకుందరరావు దంపతులు

అమెరికాలో తెలుగు విద్యార్థుల మృతి బాధాకరం

● కుటుంబ సభ్యులకు రాజకుమారి దంపతుల పరామర్శ

తెనాలి రూరల్, జూలై 23: ఉన్నత చదువులకు అమెరికా వెళ్లిన విద్యార్థులు మృతి చెందారని తెలిసి తాను ఎంతో మనోవేదనకు గురయ్యానని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. తెనాలి ఐతానగర్‌కు చెందిన జెట్టి హారిక అమెరికాలో కారు ప్రమాదంలో మృతిచెందగా, తాడిబోయిన రవితేజ స్విమింగ్‌పూల్‌లో ప్రమాదవశాత్తూ మృతి చెందారు. సోమవారం రెండు కుటుంబాలను నన్నపనేని రాజకుమారి, ముకుందరరావు దంపతులు పరామర్శించి, కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ పేదరికంలో ఉన్నా బిడ్డల ఉన్నత చదువుల కోసం ఇరు కుటుంబాలవారు పిల్లలను అమెరికా పంపారన్నారు. మృతదేహాలను స్వస్థలానికి తీసుకువచ్చేలా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు, పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌ల దృష్టికి తీసుకువెళ్లి ఇరువురి మృతదేహాలను తెనాలికి సాధ్యమైనంత త్వరగా తెప్పించేలా చూస్తానన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

తెనాలి రూరల్, జూలై 23: ఉన్నత చదువులకు వెళ్లి విద్యార్థులు మృతి చెందటం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ ద్వారకా శ్రీను అన్నారు. మంగళవారం తెనాలి ఐతానగర్‌లోని ఇటీవల అమెరికాలో మృతి చెందిన హారిక, రవితేజ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢసానుభూతిని వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.


బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

విత్తన శుద్ధిపై అవగాహన

పొన్నూరు టౌన్, జూలై 23: ప్రకృతి వ్యసాయపరంగా బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకుంటే భూమి నుంచి విత్తనాలకు సోకే వైరస్‌లు, చీడపీడల నుంచి కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనియన్ ఇన్‌చార్జి రాజారత్నం అన్నారు. మండల పరిధిలోని గోళ్లమూడిపాడులో జిల్లా ప్రకృతి వ్యసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బీజామృతంతో విత్తనశుద్ధిపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో విత్తనశుద్ధి చేయించి దానివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయటం వల్ల 30 రోజుల పాటు విత్తనానికి, పైరుకు చీడపీడల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. తప్పనిసరిగా విత్తనశుద్ధి ద్వారానే పంటల సాగు చేపట్టాలని రైతులను కోరారు. కార్యక్రమంలో యూనిట్ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ వీసీ గంగాధర్‌కు అభినందనలు


వైస్ చాన్సలర్ గంగాధర్‌ను అభినందిస్తున్న రాంచంద్

తెనాలి అర్బన్, జూలై 23: నాగార్జున యూనివర్శిటీ అభివృద్ధికి ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ కంచర్ల గంగాధర్ కృషిచేయాలని ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ కోరారు. యూనివర్శిటీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం కలిసి అభినందించారు. శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆయన వైస్ చాన్సలర్ కావడం అభినందనీయమని, విద్యార్థులకు తగిన విద్యా ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని కోరారు. అభినందనలు తెలిపిన వారిలో డాక్టర్ రాజీవ్ తదితరులు ఉన్నారు.

పీబీఎన్ కళాశాలల్లో నూతన కోర్సులు

పొన్నూరు టౌన్, జూలై 23: పీబీఎన్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ బీకాంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ అనే కొత్త కోర్సును ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శివకుమారి మంగళవారం తెలిపారు. భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కోర్సును రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మూడు సంవత్సరాల కాలపరిమితి గల ఈ డిగ్రీ కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా లభించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవలసినదిగా కళాశాల ప్రెసిడెంట్ కెప్టెన్ ఎస్.అంకప్పచౌదరి, కరస్పాండెంట్ ఎస్.అన్నారావు తదితరులు తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

పొన్నూరు టౌన్, జూలై 23: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను అసెంబ్లీలో ఏకగ్రీవంగా రద్దు చేయటం హర్షణీయం అని పొన్నూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ బాజి సాహెబ్ మంగళవారం తెలిపారు. నల్లచట్టాన్ని రద్దు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు పొన్నూరు బార్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.



దశావతార వెంకటేశ్వర స్వామికి ఆషాడపట్టీ సమర్పణ

పెదకాకాని, జూలై 23: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న శ్రీ దశావతార వెంకటేశ్వర స్వామికి ఆషాడమాసం సందర్భంగా మంగళవారం భక్తులు ఆషాడపట్టీ సమర్పించారు. చిలకలూరిపేటకు చెందిన ప్రమీల వారి మిత్ర బృందం ఈ ఆషాడ పట్టీని సమర్పించారు.

ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద వాహనాల బారులు

● మరో స్టాక్ పాయింట్‌ను ప్రారంభించాలంటున్న వినియోగదారులు




మున్నంగి స్టాక్‌పాయింట్‌లో ఇసుకలోడు చేస్తున్న జేసీబీలు, స్టాక్‌పాయింట్ సమీపంలో బారులు తీరిన లారీలు, ట్రాక్టర్లు



కొల్లిపర, జూలై 23: ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీతో ప్రజలు ఒకపక్క అనందం వ్యక్తం చేస్తున్నప్పటికి ఇసుక సకాలంలో అందక మరోవైపు వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక స్టాక్ పాయింట్‌లలో సిబ్బంది కొరత తీవ్ర సమస్యగా మారింది. దాంతోపాటు స్టాక్‌పాయింట్‌లో ఏర్పచిన సిస్టమ్ సక్రమంగా పని చేయడం లేదు. దీంతో ఇసుక కోసం వచ్చిన వినియోగదారులు పడిగాపులు పడుతున్నారు.. ఒకొక్కసారి మూడు రోజులకు కూడా ఇసుకలోడు కావటంలేదని వినియోగదారుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఇసుక వినియోగదారులు స్టాక్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపులతో టన్ను ఇసుకకు రూ.250లు చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక కోసం వచ్చిన వారు డిజిటల్ కోడ్ ద్వారా నగదును చెల్లించినప్పటికి స్టాక్ పాయింట్‌లో ఏర్పాటుచేసిన సిస్టమ్ సరిగా పని చేయకపోవటంతో రసీదు కోసం గంటలు తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఇసుక స్టాక్ పాయింట్ సమీపంలో ఉన్న వాహనాలకు స్లిప్పులు పంపిణీ కూడా సక్రమంగా లేకపోవటంతో అక్కడ ఏర్పాటుచేసిన పోలీసు అధికారులు కూడా తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం మున్నంగి ఇసుక స్టాక్‌పాయింట్‌ను ప్రారంభించి 16 రోజులు అయినప్పటికీ ఇసుక కోసం వచ్చిన వినియోగదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మున్నంగి ఇసుక స్టాక్‌పాయింట్‌లో రెండు సిస్టమ్‌లు ఉన్నప్పటికి సిబ్బంది కొరతతో ఒక సిస్టమ్ మాత్రమే పని చేస్తోంది. దీంతో ఇసుక కోసం వచ్చిన వారు పలు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఇసుక స్టాక్ పాయింట్‌లు రెండు ఉన్నప్పటికి అధికారులు ఒకే దానిని ప్రారంభించటంతో వాహనాలకు ఇసుకను లోడు చేయటానికి అలస్యమవుతోంది. దీంతో వాహనదారులు పడిగాపులు పడాల్సివస్తోంది. వినియోగదారుల సౌకర్యార్థం రద్దీని నివారించటానికి అక్కడ ఉన్న రెండో స్టాక్ పాయింట్‌ను కూడా ప్రారంభించాలని వినియోగదారుల ప్రధాన డిమాండ్‌గా ఉంది. అంతేకాక మున్నంగి స్టాక్‌పాయింట్ కృష్ణానది లంక భూముల్లో ఏర్పాటుచేయడం వలన కృష్ణానది వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. వరద ముంపు ఏర్పడితే మున్నంగి స్టాక్ పాయింట్ నుంచి ఇసుక రవాణా సాధ్యం కాదని కాబట్టి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇసుక వినియోగదారులు కోరుతున్నారు.

డ్రెయిన్‌లలో వ్యర్థాలను వేయవద్దు

మున్సిపల్ కమిషనర్ శేషన్న


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట జూలై 23: పట్టణ ప్రజలు వ్యర్థాలను డ్రెయిన్‌లలో, మురుగు కాలువలలో వేరాదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. స్థానిక మారీసుపేటలోని సీబీఎన్ కాలనీలో మంగళవారం మున్సిపల్ అధికారులు చేపట్టిన డ్రెయిన్‌లోని సిల్ట్ తొలగింపు పారిశుధ్య పనులను పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు చెత్తను మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. డ్రెయిన్‌లు, మురుగు కాలువలపై అక్రమ కట్టడాలను తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం 29వ వార్డు మార్కెట్ యార్డ్, 32వ వార్డు యడ్ల లింగయ్య కాలనీలలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ ఆధార్ క్యాంప్‌ను పరిశీలించిన కమిషనర్

తెనాలి, మారీసుపేట జూలై 23: పట్టణంలోని 15వ వార్డులో వాసిరెడ్డి మున్సిపల్ ప్రైమరీ స్కూల్, నెహ్రూనికేతన్ స్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న స్పెషల్ ఆధార్‌క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపును పట్టణ మున్సిపల్ కమిషనల్ శేషన్న సందర్శించి సిబ్బందికి తగు సూచలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఆధార్ క్యాంపులను ప్రజలు ఉపయోగించుకొని తమ ఆధార్‌లలో ఇంటి చిరునామా మార్పు, జన్మదిన తేదీలలో తప్పులను సరిచేసుకోవాలని, ఆధార్ కార్డులు లేని పిల్లలకు ఆధార్‌లను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఈవీ ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు

● ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వీ సందీప్



మాట్లాడుతున్న ఆచార్య ఆచార్య సందీప్

గుంటూరు (విద్య), జూలై 23: భవిష్యత్‌లో ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు భారీ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వీ.సందీప్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ- వాణి (వైబ్రంట్ అడ్వోకసీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ ల్యాంగ్వేజెస్) ఆర్థిక సహకారంతో 'విద్యుదీకరణ చలనశీలత, ఎలక్ట్రిక్ వాహనాలతో భవిష్యత్‌ను రూపొందించడం' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించి వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ.సందీప్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వెహికల్స్‌దేనని పేర్కొన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగాలలో విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్స్ డిజైనింగ్‌ను ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలు కలిసి పనిచేయాలన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ బ్యాటరీ పనితనం, స్టోరేజ్ గురించి విద్యార్థులకు వివరించారు. బ్యాటరీ నుంచి వచ్చే వ్యర్థాలను విసర్జించడం ఒక సవాల్ అని తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, వివిధ విభాగాధిపతులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను సంతృప్తిపరిచే కేంద్ర బడ్జెట్

● బీజేపీ నేతలు

తెనాలి అర్బన్, జూలై 23: దేశంలో అన్ని వర్గాలను సంతృప్తిపరిచేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని బీజేపీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయింపు, పోలవరం పూర్తి చేసేందుకు ప్రత్యేక నిధులు, పరిశ్రమల అభివృద్ధికి చేయూత, విశాఖ, చెన్నై మార్గం అభివృద్ధి వంటి ఎన్నో అంశాలను రాష్ట్రానికి ప్రకటించి విభజన చట్టం హామీలను నెరవేర్చే దిశగా కేంద్రం పని చేస్తుందన్నారు. అడపా సంపత్‌రాయుడు, దారా సాయిగుప్తా, రవీంద్రబాబు, హనుమంతరావు పాల్గొన్నారు.


పేదలకు దుస్తులు, సరుకులు అందజేస్తున్న రవికుమారి తదితరులు

మైకా మినిస్ట్రీస్‌లో నిత్యావసరాలు పంపిణీ

తెనాలి అర్బన్, జూలై 23: ఐతానగర్‌లోని మైకా మినిస్ట్రీస్ చర్చిలో మంగళవారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బిషప్ పాముల ఐజయ్య జయంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో పలు సామాజిక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పాముల రవికుమారి తెలిపారు. జాన్సన్, అనూష, సంసోను, అక్కిదాసు కిరణ్, కనపర్తి అనిల్, రాజువెల్ట్ పాల్గొన్నారు.

మహిళ మెడలో చైను అపహరణ

తెనాలి, మారీసుపేట జూలై 23: పట్టణంలో నడిచి వెలుతున్న మహిళ మెడలోని చైనును గుర్తు తెలియని ఆగంతకులు అపహరించిన ఘటన చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం చెంచుపేటలోని రావి టవర్స్ వద్ద నడచి వెళుతున్న మహిళ మెడలోని గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తుతెలియని ఆగంతకులు అపహరించారని తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదుపై మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

నేడు ఆర్‌వీఆర్ అండ్‌జేసీలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

● హాజరుకానున్న ఇస్రో శాస్త్రవేత్తలు

గుంటూరు(విద్య), జూలై 23: స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నుంచి ఇస్రో ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి షార్ శాస్త్రవేత్తలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. చంద్రయాన్-3 చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం, ఇస్రో, శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, నేతృత్వంతో ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల సహకారంతో నిర్వహించనున్న తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం బుధ, గురువారాల్లో విజయవంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు. స్పేస్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షార్ శ్రీహరికోట, సైంటిస్ట్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ (ఇన్‌చార్జ్) ఆచార్య కె రామమోహనరావు, షార్ డిప్యూటీ డైరెక్టర్ టి.ఎస్.రఘురాం తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం శుభపరిణామం

● టీడీపీ నాయకుడు వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం దక్కడం శుభపరిణామమని టీడీపీ సీనియర్ నాయకులు, గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజధాని అమరావతిని నిర్వీర్యం అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 47 రోజుల్లోనే కేంద్రం సాయంతో ఆంధ్రుల రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి అడుగులు ముందుకు పడటం శుభపరిణామం అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచుకోవడంలో చూపిన శ్రద్ధ అమరావతి రాజధానిని నిర్మించటలో చూపలేకపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారైనా కేంద్రం వద్ద ప్రాంత అభివృద్ధిపై చర్చించింది లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిల నాయకత్వంతో 47 రోజుల్లోనే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయించేలా పోరాడారని చెప్పారు. రానున్న రోజుల్లో ఆంధ్రుల రాజధాని కల నెరవేరనుందని దేశం గర్వించదగ్గ ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు తీర్చిదిద్దుతారని మురళి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ఇంచుకూడా కదల్చకుండా రైతాంగాన్ని నిలువునా ముంచేలా చూసిందని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన ప్రాజెక్టును పరిశీలించి దానిని పూర్తిచేసేందుకు ముందుకుసాగుతున్నారన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌గా అతిస్వల్ప కాలంలోనే రాష్ట్రం దేశంలోనే గొప్ప గుర్తింపు తెచ్చుకుంటుందని, అందుకు కూటమి ప్రభుత్వం కృషిచేయటం ఖాయమన్నారు.

నిధులను పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలి

● కమిషనర్‌కు సర్పంచుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

గుంటూరు సిటీ, జూలై 23: గత ప్రభుత్వం దారి మళ్లించిన స్థానిక సంస్థల నిధులను పంచాయతీల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు పంచాయతీ రాజ్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజను కలసి వినతి పత్రం అందజేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సర్పంచులకు మీటింగ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



పొన్నూరు టౌన్, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఆంధ్ర ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నాయని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మంగళవారం అన్నారు. ప్రధానంగా రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రూ.15వేల కోట్ల ప్రత్యేక సాయం కేటాయించటం హర్షణీయం అన్నారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో అమరావతి అభివృద్ధికి మరిన్ని నిధులు సాయంగా అందిస్తామని బడ్జెట్‌లో చెప్పటం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. విభజన చట్టానికి అనుగుణంగా రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి సంపూర్ణసాయం అందిస్తామని బడ్జెట్‌లో చెప్పటం రైతులందరికి సంతోషదాయకంగా ఉందన్నారు. పోలవరం పూర్తితో ఆహార భద్రత సాధ్యమవుతుందన్నారు. అలాగే విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందించటం ఆహ్వానించదగ్గ పరిణామంగా తెలిపారు. విశాఖ, చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేకసాయం, హైదరాబాద్, బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. దీనివల్ల రాష్ట్రంలో కుదేలైన పారిశ్రామికరంగం తిరిగి అభివృద్ధిబాట పడుతుందన్నారు. కొప్పర్తి ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్తు, రహదారులు, హైవేల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించటం వంటి పరిణామాలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ముఖచిత్రానికి మార్గాలుగా తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు.


పురపాలక సంఘంలో విచారణ జరుపుతున్న మెప్మా అధికారులు

బోగస్ గ్రూపులపై కొనసాగుతున్న విచారణ

పొన్నూరు టౌన్, జూలై 23: పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగిన బోగస్ గ్రూపులు, అక్రమ నిర్మాణాలపై మంగళవారం 2వ రోజు విచారణ కొనసాగింది. తొలిరోజు మెప్మా అధికారులు, సిబ్బంది ఒక్కరిపై మరొకరు ముడుపుల ఆరోపణలు చేసుకున్నారు. అంతేకాకుండా బోగస్ గ్రూపుల ఏర్పాటులపై ఒకరిపై మరొకరు పరస్పరం ఆరోపణలు చేసుకోవటం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పట్టణంలోని 8వ వార్డులోని ఐదు సంఘాలకు సంబంధించి సభ్యులను మంగళవారం విచారణకు పిలవగా కేవలం కొద్ది మంది మాత్రమే విచారణకు హాజరై అధికారులకు స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అయితే ఈ ఆరోపణలపై విచారణకు వచ్చిన మెప్మా అధికారులు ఇప్పటికి ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. బ్యాంకులో జరిగిన విచారణ, స్థానిక మెప్మా సిబ్బంది ఆరోపణలతో అక్రమాలు జరిగింది వాస్తవమేనని విచారణ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. బోగస్ గ్రూపుల ఏర్పాటు, ప్రైవేటు బ్యాంక్‌లో నిబంధనలకు విరుద్ధంగా పొదుపు రుణాలు ఇప్పించటం వంటి విషయాల్లో ఇప్పటికే నిజాలు నిర్ధారణ అయినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ గ్రూపులకు సంబంధించిన పొదుపు మహిళలు విచారణ అధికారుల ముందుకు రాకపోవటంతో సంఘం సభ్యుల వద్దకే వెళ్లి విచారణ చేపట్టే దిశగా అధికారులు ప్రయత్నిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలు, విచారణలో వెలుగుచూస్తున్న వాస్తవాలు, ప్రాజెక్టు డైరెక్టర్‌కు వివరించి తదుపరి చర్యలు తీసుకుంటామని విచారణ అధికారులు ఎం.రాజశేఖర్, టి.కీర్తి తెలిపారు.

పాఠ్యాంశాల నమూనాల ప్రదర్శన


సైన్స్ ప్రదర్శనను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

చేబ్రోలు, జూలై 23: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయవచ్చని మండల విద్యాశాఖ అధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం కేసీహెచ్ స్కూల్‌లో మంగళవారం శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా పాఠ్యాంశాల నమూనాల ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు ఈ నమూనాల ద్వారా పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీసీ విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి 15లక్షల కోట్లు కేటాయించాలి: కాంగ్రెస్

పొన్నూరు టౌన్, జూలై 23: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి 15లక్షల కోట్ల రూపాయలను కేటాయించాల్సిన అవసరం ఉందని కాంగెస్ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్ మంగళవారం అన్నారు. విభజన చట్టం ప్రకారం నిధులు కేటాయించకుండా అమరావతికి కేవలం 15వేల కోట్లు కేటాయిస్తే ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. కనీసం రాబోయే ఐదేళ్లలో 2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేసారు. బీజేపీ అంకెల గారడిమాని చిత్తశుద్ధి చూపాలని జక్క రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు.